నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 10 డిసెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

గోపాల్‌పేటలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- తెలంగాణ తల్లి ఆకృతి మార్పుపై ఆగ్రహం
- రేవంత్ సర్కారు తీరుపై భగ్గుభగ్గు
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో విగ్రహాలకు బీఆర్ఎస్ నేతల క్షీరాభిషేకాలు

# ఆత్మగౌరవానికి అవమానమే..

*తెలంగాణ తల్లి ఆకృతి మార్పుపై బీఆర్ఎస్ భగ్గుమన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం విగ్రహంలో చేసిన మార్పులకు నిరసనగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేసిన నాయకులు.. రేవంత్ సర్కారు తీరుపై కన్నెర్ర చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. విగ్రహంలో మార్పులు కాదు.. ప్రగతి చేపట్టి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని హితవు పలికారు. ఆత్మగౌరవాన్ని చాటేలా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని అన్నారు. విగ్రహాన్ని మార్చి రేవంత్ సర్కారు సంబురాలు చేసుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజాపాలన ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు చరమగీతం పాడే రోజులు త్వరలోనే రానున్నాయని హెచ్చరించారు.*

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 9*

జడ్చర్ల : మాజీ సర్పంచులను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

భీమ్లాఘణపురం : తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# నిర్బంధకాండ

- మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు
- అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అడ్డగింత
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా పలువురిని అరెస్టు చేసి స్టేషన్లకు తరలింపు

*మాజీ సర్పంచులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధకాండ కొనసాగింది. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మాజీ సర్పంచులు తరలివెళ్లకుండా ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. ఉదయమే ముందస్తుగా అరెస్టు చేసిన వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న తమను అరెస్టు చేయడం ప్రజాపాలన సిద్ధాంతమా? అంటూ నిలదీశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ఏమీ అడగకూడదా..? ప్రశ్నించే గొంతుకలను నొక్కుతారా..? పెండింగ్ బిల్లులు విడుదల చేయకుండా అరెస్టులా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన నేతలను అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.*

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 9*

భూత్పూర్ : మాజీ సర్పంచులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

గోపాల్‌పేటలో క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు


గద్వాల : జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోపాల్‌పేటలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

# కేసీఆర్ సుదీర్ఘ పోరాటంతోనే..

- డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన
- రాష్ట్ర అవతరణకు నాంది పలికిన రోజు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, డిసెంబర్ 9 : కేసీఆర్ సుదీర్ఘ పోరాటం వల్లే అప్పటి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు సంబంధించి ప్రకటన చేసిందని మాజీ వ్యవ సాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గుర్తు చేశారు. నవంబర్ 29వ తేదీ నుంచి 11 రోజుల పాటు కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా ఢిల్లీ పీఠం గడగడ వణికి డిసెంబర్ 9వ తేదీన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు నాంది పలికిందన్నారు. అందుకే ఈరోజును విజయ్ దివస్‌గా జరుపుకొంటున్నామని తెలిపారు. విజయ్ దివస్ సందర్భంగా సోమవారం మండల కేంద్రం లోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరంజన్‌రెడ్డి పూల మాలలు వేసి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలర్పించిన తొలి అమరుడు శ్రీకాంతాచారి, అలాగే పోలీసు కిష్టయ్య, యాదయ్య, సువర్ణ తదితరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటంతోనే రాష్ట్రాన్ని సాధించి, అధికారం చేపట్టారన్నారు. బంగారు తెలంగాణ దిశగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశారని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెట్టారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇస్తామన్న హామీలన్నీ నీటిమూటలుగా మిగిలిపోయాయని ధ్వజమెత్తారు. దీంతో ప్రజలు నానా పాట్లు పడుతున్నారని వాపోయారు. తెలంగాణ లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు మరో ఉద్యమం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని చెప్పారు. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కేసీఆర్‌కు అండగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం బస్టాండ్ సమీపంలో నూతనంగా ఆవిష్కరించిన మహనీయులు జ్యోతిబా పులే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం మున్న నూల్‌కు చెందిన సోడె వెంకటయ్య, అతడి భార్య సోడె చిట్టెమ్మ జూలై 23న ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి మృతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో ఒక్కొక్కరికీ రూ2 లక్షల చొప్పున ఇద్దరికి రూ.4 లక్షల ఇన్సూరెన్స్ డబ్బులకు చెందిన చెక్కులను మృతుల కుమారులు మల్లేశ్, హర్షవర్ధన్‌కు నిరంజన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ హర్యానాయక్, పీఏసీసీఎస్ చైర్మన్ గువ్వల రాములు, నాగవరం విండో అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బాల రాజు, రైతుబంధు మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్, నాయకులు చంద్రశేఖర్, మతీన్, రాజేశ్‌గౌడ్, భాస్కర్, మన్యం, కాశీనాథ్, రవి, రాజు, రాములు, మన్సూర్, యాది, శ్రావణ్, వెంకటయ్య, గోపాల్‌రావు, వెంకటేశ్, శ్రీనివాసులు, శంకరయ్య, కృష్ణయ్య, నాగరాజు, శ్రావణ్, శేషిరెడ్డి, తిరుపతయ్యగౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మేడికొండలో చెత్తలో సంచరిస్తున్న పందులు, డీజిల్ లేక చెత్తతోపాటే నిలిచిపోయిన పంచాయతీ ట్రాక్టర్, డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు, చెత్త

# పడకేసిన పారిశుధ్యం

- అపరిశుభ్రంగా మేడికొండ గ్రామంలోని వీధులు
- డీజిల్ లేక చెత్త తరలింపే ట్రాక్టర్ నిలిపివేత
- పందుల స్వైరవిహారం
- పట్టించుకోని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న వాసులు

అయిజ, డిసెంబర్ 9 : పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. నిత్యం వీధులను పరిశుభ్రం చేయాల్సిన పారిశుధ్య సిబ్బంది, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పల్లెలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలంటే డీజిల్ అవసరం. కానీ డీజిల్ లేకపోవడంతో ట్రాక్టర్లను నిలిపివేయడంతో ఎక్కడి ట్రాక్టర్లు అక్కడే ఉన్నాయి. దీంతో చెత్తలో పందుల సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మండలంలోని మేడికొండ గ్రామంలో వీధులు అపరిశుభ్రంగా మారాయి. పారిశుధ్య కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టినా చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ కష్టతరమవుతుందని పంచాయతీ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే లక్షలు చేతి నుంచి ఖర్చు పెట్టుకున్నా ప్రభుత్వం నిధులను జమ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా పంచాయతీలో నిధులు లేకపోవడంతో చెత్త తరలింపును నిలిపివేసిన మాట వాస్తవమే అని అన్నారు. వీధుల్లో పారిశుధ్య పనులు నిరంతరం చేపడుతున్నామన్నారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# రెగ్యులర్ చేయరు.. జీతాలివ్వరు

- ఆరు నెలలుగా కాంట్రాక్ట్ లెక్చరర్లకు నిలిచిన వేతనాలు

మహబూబ్‌నగర్ జూనియర్ కళాశాల

అచ్చంపేటటౌన్, డిసెంబర్ 9 : కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయదు.. వారికి నెల నెలా జీతాలివ్వదు.. దీంతో వారి బాధలు వర్ణనాతీతం. ఆరు నెలలుగా కాంట్రాక్ట్ లెక్చరర్లకు జీతాలు అందక అయోమయ స్థితిలో ఉన్నారు. పాఠాలు బోధించే వారికి పస్తులు ఉంచే దౌర్భాగ్యపు స్థితి ఏర్పడిందని కాంట్రాక్ట్ లెక్చరర్లు వాపోతున్నారు. ప్రజా ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి దీనస్థితికి దిగజార్చింది. గత కేసీఆర్ ప్రభుత్వంలో జీవో నెం 16 ద్వారా ఆరు వేల కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. మిగిలిన వారిని కూడా రెగ్యులర్ చేసే సమయంలో ఎలక్షన్ కోడ్ రావడంతో తదుపరి ప్రభుత్వం ఏర్పాటు తరువాత చేయాలని నిర్ణయించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన వారికి రెగ్యులర్ చేయడం దేవుడెరుగు కనీసం వారికి నెల నెలా జీతాలు ఇచ్చే స్థితిలో లేదు. జూలై నుంచి ఇప్పటి వరకు జీతాలు రాక రెగ్యులర్ కాక కాంట్రాక్ట్ లెక్చరర్లు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులు, నాయకులను కలిసి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా లాభం లేక పోయింది. నాయకులు అధికారులు కాంట్రాక్ట్ లెక్చరర్లపై దృష్టి సారించి వెలుగులు నింపాలని పలువురు కోరుతున్నారు.

## జీతాలైనా రెగ్యులర్‌గా ఇస్తే బాగుంటుంది

రెగ్యులర్ చేయడం దేవుడెరుగు కనీసం నెల నెలా జీతాలిస్తే అధ్యాపకులు ఆనందంగా విద్యార్థులకు న్యాయం చేయగలుగుతాం. చాలా మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు వారి కుటుంబ పోషణ భారమవ్వడంతో మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్ని సార్లు అధికారులు, రాజకీయ నాయకులకు మొర పెట్టుకున్నా ఫలితం కనిపించడం లేదు. ఇప్పటికైనా కాంట్రాక్ట్ ఉద్యోగులపై దృష్టి సారించి వారికి న్యాయం చేస్తే విద్యార్థులకు న్యాయం చేసినవారవుతారు.

*- రవిశంకర్, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు*

## కాలయాపన చేస్తున్నారు..

ప్రజా ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీసం ఉద్యోగ భద్రత లేకుండా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం 6వేల మందిని రెగ్యులర్ చేసినప్పటికీ ఈ ప్రజా ప్రభుత్వంలో అన్ని అర్హతలు కలిగి ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో పనిచేస్తున్న కనీసం 450మంది కూడా రెగ్యులర్ చేయలేక కాలయాపన చేస్తున్నది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నాను.

*- మల్లికార్జున్, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర సెక్రటరీ*

## ఉద్యోగ భద్రత కల్పించాలి..

రెగ్యులర్ అయ్యేంత వరకు ఉద్యోగ భద్రత కల్పించి, మూల వేతనం తీసుకుంటున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు డీఏ, హెచ్ఆర్ఏ, ఇంక్రిమెంట్‌తో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకుంటున్నాం.

*- గౌతం, కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్*

# భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

- కర్నూల్ జిల్లా యాగంటిలో ఘటన
- అయిజకు చెందిన దంపతులుగా గుర్తింపు
- నంద్యాల దవాఖానకు తరలింపు
- చికిత్స పొందుతున్న బాధితులు

అయిజ, డిసెంబర్ 9 : కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో అయిజ పట్టణానికి చెందిన భార్యాభర్తలు పల్లవి, భార్గవ్ కర్నూల్ జిల్లాలోని యాగంటి పుణ్యక్షేత్రంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. అయిజ పట్టణానికి చెందిన పల్లవి, భార్గవి భార్యాభర్తలు. కొంత కాలంగా కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేక పోవడం, గతేడాది కుమారుడు మృతిచెందడంతో మనోవేదనకు గురయ్యారు. ఈ పరిస్థితుల్లో కర్నూల్ జిల్లాలోని యాగంటికి వెళ్లిన దంపతులు సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రహించిన ఆలయ అధికారులు, భక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బగనానపల్లె ప్రభుత్వ దవాఖానకు తరలించి, అయిజలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో బనగానపల్లెకు చేరుకున్న కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుల ఆరోగ్యం ప్రస్తుతం కొంత మెరుగ్గా ఉందని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. గతేడాది పల్లవి, భార్గవ్‌ల కుమారుడికి తండ్రి భార్గవ్‌వే ఎలుకల మందు తాపడంతో మృతిచెందిన ఘటన మరువక ముందే ఈ ఘటన చోటు చేసుకోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు.

# కంపుకొడుతున్న బాత్రూంలు

- భోజనంలో న్యాణత లేదు.. ఏం చేస్తున్నారు మీరు?
- జడ్జి మిథున్ తేజ ఆగ్రహం

అలంపూర్ కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 9 : విద్యార్థుల ఉపయోగించే బాత్రూంలు కంపు కొడుతున్నాయి.. భోజనం నాణ్యత లేదు ఏం చేస్తున్నారు మీరు అని అలంపూర్ కోర్టు జడ్జి మిథున్ తేజ కస్తూర్బా బాలికల పాఠశాల సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం 7గంటలకు అలంపూర్ పట్టణం లోని కస్తూర్బా పాఠశాలను న్యాయవాదులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో భోజనాన్ని పరిశీలించగా రుచిగా లేక పోవడంతో రుచికరమైన భోజనం వడ్డించాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులకు చదువుతో పాటు, న్యాణమైన భోజనం అందించాలని లేక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పాఠశాలలో విద్యార్థులు ఉపయోగించే బాత్రూంలను పరిశీలించారు. బాత్రూంలు అపరిశుభ్రంగా కంపు వాసనతో ఉండడంతో ఇలా ఉంటే విద్యార్థులకు ఆనారోగ్య సమస్యలు తతెత్తుతాయని వీటిని ప్రతి రోజూ శుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు న్యాణమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత మీపై ఉందని అక్కడి సిబ్బందికి హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌కుమార్, న్యాయవాదులు రాజేశ్వరి, శ్రీధర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్ ఉన్నారు.

పాఠశాల వద్ద ఉన్న కొండచిలువ

# కొండచిలువ కలకలం

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబర్ 9 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో కొండచిలువ కలకలం రేపింది. కొండచిలువను వాకర్స్ సోమవారం గుర్తించారు. స్థానికుల వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని మోడల్ స్కూల్ ఎదుట కొండచిలువ వెళ్తుండడంతో స్థానికులు చూసి భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి కొండచిలువను పట్టుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.